క్లుప్తంగా

సాయినాథునికి ప్రత్యేక పూజలు



సాయిబాబాకు పూజలు చేస్తున్న కట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, సాయిసుజన దంపతులు

ఓజిలి : మండలంలోని మానమాల గ్రామంలో సాయినాథునికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. మందిర నిర్మాణకర్తలు ఉచ్చూరు హరనాథ్‌రెడ్డి, శోభారాణి దంపతులు గోత్రనామాలతో పూజలు చేసి కాగడ హారతి ప్రారంభించారు. నాయుడుపేట మండలం మేనకూరుకు చెందిన కట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, సాయి సుజన, సత్య సుధాకర్, లక్ష్మిసాయి ఉభయకర్తలుగా వ్యవహరించి 150 మందికి అన్నదానం చేశారు. రాత్రి పల్లకి సేవ చేశారు.

కబడ్డీ పోటీల్లో విద్యార్థి ప్రతిభ



విద్యార్థి శైలేష్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కోట : జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో చిట్టేడు ఎస్టీ గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థి వి.శైలేష్ ప్రతిభ కనబరిచాడు. హర్యాణా రాష్ట్రం బివానీలో ఈ నెల 11 నుంచి జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొని సత్తా చాటినట్లు ప్రిన్సిపాల్ శేషవర్ధన్ తెలిపారు. విద్యార్థిని వైస్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, పీడీ సత్యనారాయణ అభినందించారు.

నేడు సామాజిక తనిఖీ బహిరంగ వేదిక

సైదాపురం : స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద శుక్రవారం సామాజిక తనిఖీ బహిరంగ వేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ తెలిపారు. మండలంలో 2013-24లో రూ.9.52 కోట్లతో ఉపాధి హామీ పనులు చేసినట్టు తెలిపారు. పనులను సామాజిక తనిఖీ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పరిశీలించినట్టు తెలిపారు. ఈ క్రమంలో సామాజిక బహిరంగ ప్రజావేదిక నిర్వహించి అవకతవకలను వివరిస్తారని తెలిపారు.

విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలి

సైదాపురం : విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని ఏఈ వెంకటేశ్వర్లు కోరారు. జాతీయ పొదుపు ఇంధన వారోత్సవాల సందర్భంగా గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వినియోగదారులు విద్యుత్ ఉపకరణాలను 3, 5 స్టార్ రేటింగ్ ఉన్న వాటిని ఉపయోగిస్తే విద్యుత్‌ను ఆదా చేయవచ్చని తెలిపారు. అలాగే రాయితీపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో పీఎం సూర్యఘర్ రూఫ్ టాప్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముగిసిన శిక్షణా తరగతులు



మాట్లాడుతున్న ఎంపీడీవో గోవర్ధన

దొరవారిసత్రం : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, సర్పంచులు, గ్రామ సచివాలయ సిబ్బందికి సుస్థిర అభివృద్ధి ప్రణాళికపై ఇస్తున్న శిక్షణా తరగతులు గురువారం ముగిశాయి. ఎంపీడీవో గోవర్ధన మాట్లాడుతూ శిక్షణా తరగతుల్లో నేర్చుకున్న ప్రతి అంశాన్నీ అమలు చేయాలన్నారు. గ్రామాలు అభివృద్ధి బాటలో నడిచేలా చూడాలన్నారు. వైస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ రమేష్, వివిధ శాఖల అధికారులు కృష్ణయ్య, మునిరాజ, ఉమామహేశ్వరి, మెహతాజ్ పాల్గొన్నారు.

కండలేరులో 56.700 టీఎంసీల నీరు

రాపూరు : కండలేరు జలాశయంలో గురువారం నాటికి 56.700 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరుకు వరద కాలువ ద్వారా 700 క్యూసెక్కులు, సోమశిల జలాశయం నుంచి 1,100 క్యూసెక్కుల నీరు వస్తోందని తెలిపారు. అలాగే కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 850, లోలెవల్ కాలువకు 10, హైలెవల్ కాలువకు 160, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

జగనన్న జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహిద్దాం

వెంకటగిరి(సైదాపురం): వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఈ నెల 21న ఘనంగా జరుపుకుందామని వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

ఆగమోక్తంగా సంకట చతుర్దశి పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని అంజి అంజి వినాయకస్వామి ఆలయంలో గురువారం సంకట చతుర్దశి పూజలను ఆగమోక్తంగా నిర్వహించారు. ఈ పూజలను ప్రతి కుటుంబమూ చేసుకునేలా ఆర్జిత సేవగా తీసుకువచ్చారు. గణపతి హోమాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు. స్వామివారికి అభిషేకం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శిథిలావస్థలో తుపాన్ షెల్టర్లు

కోట: తుపాన్లు, ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలకు రక్షణ కల్పించేందుకు తీరప్రాంత గ్రామాల్లో నిర్మించిన తుపాన్ షెల్టర్లు శిథిలావస్థకు చేరాయి. ప్రస్తుతం ప్రజలకు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో షెల్టర్ కల్పిస్తున్నారు. ప్రతి ఏటా నవంబర్, డిసెంబర్ నెలల్లో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడి వాయుగుండంగా మారి భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో తీరప్రాంత గ్రామాల్లోని ప్రజలు ఇబ్బందులు పడకుండా 35 ఏళ్ల క్రితం కర్లపూడి, సిద్ధవరం, గోవిందపల్లి, గోవిందపల్లిపాళెం, దైవాలదిబ్బ, వావిళ్లదొరువు, కొత్తపట్నం, శ్యామ్‌సుందరపురంలో తుపాన్ షెల్టర్లు నిర్మించారు. తుపాన్లు వచ్చిన సందర్భంగా ప్రజలను అక్కడికి తరలించి రక్షణ కల్పించడం, తర్వాత వాటి నిర్వహణ గురించి పట్టించుకోకపోవడంతో కర్లపూడి, సిద్ధవరం, శ్యామ్‌సుందరపురం, దైవాలదిబ్బ, గోవిందపల్లిపాళెంలోని తుపాను సెంటర్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటిని కూల్చివేసి కొత్త భవనాలు నిర్మించాలని పలుమార్లు కోరినా అధికారులు, నాయకులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.




శ్యామ్‌సుందరపురంలో నిరుపయోగంగా ఉన్న తుపాన్ షెల్టర్

రాత్రిళ్లు అసాంఘిక కార్యకలాపాలు

తుపాను సెంటర్ల గురించి పట్టించుకోకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి. కొంతమంది వాటిని పేకాట క్లబ్బులుగా వినియోగించుకుంటున్నారు. మరికొందరు రాత్రిళ్లు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. దైవాలదిబ్బలోని భవనాన్ని అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల అవసరాలకు వినియోగిస్తున్నారు. గోవిందపల్లిలో రైతు భరోసా కేంద్రం నడుపుతున్నారు.



సిద్ధవరంలో ఉన్న తుపాన్ షెల్టర్



కర్లపూడిలోని తుపాన్ సెంటర్

వినియోగంలోకి తేవాలి

ప్రకృతి విపత్తుల సమయంలో తలదాచుకునేందుకు తుపాన్ షెల్టర్లు నిర్మించారు. ప్రస్తుతం అవి శిథిలావస్థకు చేరాయి. వాటిలోకి వెళ్లాలంటే భయమేస్తుంది. తుపాన్లు వచ్చిన సమయంలో కష్టమైనా, నష్టమైనా ఇళ్లలోనే ఉంటున్నాం. భవనాలకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తేవాలి.
– సురేంద్ర, కర్లపూడి

కొత్త భవనాలు నిర్మించాలి

సిద్ధవరం తుపాన్ షెల్టర్ పూర్తిగా శిథిలావస్థకు చేరింది. శ్లాబ్ పూర్తిగా దెబ్బతిని పెచ్చులూడుతోంది. మరమ్మతులు చేపట్టకుండా దాన్ని కూలిచ్చేసి కొత్త భవనం నిర్మించాలి. దీనిపై పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.
– సుబ్రమణ్యం, సిద్ధవరం

ఓజిలి సచివాలయంలో ఆధార్ సేవలు

ఓజిలి: ఓజిలి సచివాలయంలో 0-6 ఏళ్ల లోపు పిల్లలకు ప్రత్యేక ఆధార్ క్యాంపులను ఏర్పాటు చేసినట్టు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లల జనన ధ్రువీకరణ పత్రాలు తీసుకొచ్చి ఆధార్ నమోదు చేసుకోవాలన్నారు. జనన ధ్రువీకరణ పత్రం లేని పిల్లల తల్లిదండ్రులు తహసీల్దార్ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని కోరారు.

సచివాలయాల తనిఖీ



సచివాలయ రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో కోటేశ్వరరావు

వెంకటగిరి రూరల్ : మండలంలోని పాళెంకోట, సోమసానిగుంట గ్రామ సచివాలయాలను ఎంపీడీవో కోటేశ్వరరావు గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహిస్తున్న హౌస్ హోల్డ్ మ్యాపింగ్, మిస్సింగ్ సిటిజన్ డేటా సర్వేను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఈ మేరకు సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు.

ప్రత్యామ్నాయం చూపాలని రైతుల ఆందోళన

చిల్లకూరు : తమకు ప్రత్యామ్నాయం చూపకుండానే రోడ్డు పనులు చేయడంపై చిల్లకూరుకు చెందిన రైతులు గురువారం ఆందోళన చేపట్టారు. చిల్లకూరు గ్రామానికి చెందిన రైతుల భూములు జాతీయ రహదారికి పడమర, తూర్పున ఇరువైపులా ఉన్నాయి. వీటికి చెరువు నుంచి కాలువల ద్వారా నీరు వస్తుంది. జాతీయ రహదారికి తూర్పు వైపున ఉన్న పొలాలకు నీరు పారేందుకు అక్కడక్కడా కల్వర్టులు ఉండడంతో ఇప్పటి వరకు నీరు సాఫీగా అందుతోంది. వరగలి క్రాస్ రోడ్డు సమీపంలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో భాగంగా పంట కాలువలను ధ్వంసం చేసి పిల్లర్లు వేస్తున్నారు. దీంతో తూర్పు వైపున ఉన్న పంట పొలాలకు నీరు అందే పరిస్థితి లేకుండా పోయింది. బ్రిడ్జి పిల్లర్ పనులు పూర్తయ్యే నాటికి మూడు నెలలకు పైగా పడుతుందని, ఈలోపు 150 ఎకరాల్లో సాగు చేసిన వరి పంటకు నీరు ఎలా అందుతుందని రైతులు వాపోయారు. రైతులకు ఇబ్బంది లేకుండా బ్రిడ్జి పనులు చేపట్టాలని, ప్రత్యామ్నాయంగా కాలువలు తవ్వి నీరు వచ్చేలా చేయాలని కోరారు.



వరగలి క్రాస్ రోడ్డు వద్ద పంట కాలువను తవ్వేస్తున్న యంత్రాలు

సర్వేలను త్వరితగతిన పూర్తి చేయండి



కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

కలువాయి : నిర్దేశించిన సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో నరసింహారావు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఆయన గురువారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ మిస్సింగ్ సిటిజన్ హౌస్ హోల్డ్ సర్వే, మ్యాపింగ్, లిటరసీ సర్వే, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల గుర్తింపు, హౌస్ హోల్డ్ సర్వేలపై ఆరాతీశారు. సచివాలయ సిబ్బంది విధులకు సక్రమంగా రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. బాధ్యతగా వ్యవహరించని సచివాలయ ఉద్యోగులకు నోటీసులు ఇవ్వడంతో పాటు వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఏపీజీబీలో పంటల బీమా

పెళ్లకూరు: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో పంట రుణం పొందిన రైతులు పంటల బీమా చేయించుకోవాలని మేనేజర్ నాగాంజనేయులు తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులందరూ బీమా చేయించుకోవాలని, ఆసక్తి లేని వారు బ్యాంకు సిబ్బందిని కలిసి ధ్రువీకరణ సమర్పించాలని కోరారు. లేనిపక్షంలో ఎకరాకు రూ.630 చొప్పున రైతు ఖాతా నుంచి నగదు జమ చేసుకుంటామని పేర్కొన్నారు. పంట బీమాకు ఈ నెల 31వ వరకు గడువు ఉందని తెలిపారు.

ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు



ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో సండే స్కూల్ పిల్లలు

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని బేరిపేటలో ఉన్న లూథరన్ చర్చి ఆవరణలోని కమ్యూనిటీ హాల్‌లో గురువారం సండే స్కూల్ పిల్లలతో ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చర్చి బిషప్ రైట్ రెవరెండ్ ఓ మైకెల్ బెన్‌హర్ మాట్లాడుతూ ప్రతి మనిషీ ప్రేమ, ఓర్పు, సహనం కలిగి ఉండాలని, పొరుగు వారి పట్ల దయ చూపాలని పేర్కొన్నారు. అనంతరం పిల్లలు క్రీస్తు పుట్టుక నాటకాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో సండే స్కూల్ కరస్పాండెంట్ ప్రేమ్‌చంద్, సంఘం పెద్దలు పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ బస్సులు

వెంకటగిరి రూరల్ : ధనుర్మాసం ప్రారంభమైన సందర్భంగా వెంకటగిరి ఆర్టీసీ డిపో నుంచి ప్రముఖ పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు మేనేజర్ రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అహోబిల నరసింహ క్షేత్రం, అన్నవరం సత్యనారాయణస్వామి, కదిరి నరసింహ స్వామి, ఇతర రాష్ట్రాల్లోని ఉడిపి, శ్రీరంగం తదితర ప్రాంతాలకు అద్దె ప్రాతిపదికన బస్సులు ఇస్తామని తెలిపారు. అదేవిధంగా భవానీ దీక్ష విరమణ సందర్భంగా విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి వెళ్లాలనుకునే భక్తులు అద్దె బస్సుల కోసం సంప్రదించాలని సూచించారు. వివరాలకు 9959225647, 7382886789, 7382887743, 9381539535 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

ఓజిలి: ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని, ఈ పద్ధతిలో పంటలు సాగు చేసి పండించిన ఆహార ఉత్పత్తులు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని జేడీఏ ఎస్.ప్రసాద్‌రావు తెలిపారు. ఆయన గురువారం ఆర్మేనిపాడు గ్రామంలో ఎన్‌పీఎం దుకాణాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 3,121 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వరి, మిరప, నిమ్మ, కూరగాయల పంటలు, కురుగొండ, ఆర్మేనిపాడు, పున్నేపల్లి గ్రామాల్లో 1,850 ఎకరాల్లో వరిపంటను సాగుచేస్తున్నట్టు తెలిపారు. అలాగే భువనగిరిపాళెం, చిలమానుచేను, పెదపరియ, గుర్రంకొండ, ఇనుగుంట, ఆర్మేనిపాడు గ్రామాల్లో నిమ్మలో అంతర పంటగా కూరగాయలు సాగుచేస్తున్నారని తెలిపారు. ఎన్‌పీఎం షాపులో లభించే కషాయాలు, జీవామృతాన్ని ఉపయోగిస్తే తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వస్తుందని తెలియజేశారు. అనంతరం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగుచేస్తున్న నవధాన్యాల సాగును పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీఏ గోపీనాయక్, ఏవోలు చెంచురెడ్డి, విజయలక్ష్మి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వీరరాఘవయ్య, జైతున్‌బీ, తిరుమల తదితరులు పాల్గొన్నారు.



నవధాన్యాల సాగును పరిశీలిస్తున్న జేడీఏ ప్రసాద్‌రావు

హెల్మెట్ ధరించకపోతే కఠిన చర్యలు

గూడూరు రూరల్ : ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ ధరించకపోతే కఠిన చర్యలు తప్పవని గూడూరు రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ తెలిపారు. ఆయన గురువారం పోటుపాళెం క్రాస్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని పలు వాహనాలకు జరిమానా విధించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. వెనుక ప్రయాణించే వారు సైతం తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. అలా కాకుండా ప్రయాణిస్తూ పట్టుబడితే కేసులు నమోదు చేయడంతో పాటు వాహనాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు.



ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్న ఎస్‌ఐ మనోజ్‌కుమార్

అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలి

చిల్లకూరు : కేంద్ర హోమ్ మంత్రి అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి తొలగించాలని కేవీపీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. వారు గురువారం గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ వద్దనున్న బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ అంబేడ్కర్‌ను ఉద్దేశించి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు తగవని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అడపాల ప్రసాద్, దారా కోటేశ్వరరావు, గర్రుం రమణయ్య, జోగి శివకుమార్, శీనయ్య, బాలాజీ, బీవీ రమణయ్య, వెంకటేశ్వర్లు, నాగరాజు, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న దళిత సంఘాల ఐక్యవేదిక

అమిత్‌షా రాజీనామా చేయాలి

సూళ్లూరుపేట : బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోమ్ మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. వారు గురువారం సూళ్లూరుపేట పట్టణంలో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ బీఆర్ అంబేడ్కర్ గొప్పతనాన్ని కొనియాడుతూ ఆయన విగ్రహాలను విదేశాల్లో సైతం ఏర్పాటుచేశారని తెలిపారు. అలాంటి వ్యక్తిని అవమానిస్తూ మాట్లాడడం సరికాదన్నారు. అమిత్‌షాను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిట్ల చిన్న, చంద్రశేఖర్, వల్లా విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

కోట : కేంద్ర హోమ్ మంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా గురువారం కోటలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు తెలిపారు. వారు గురువారం కోటలో నిరసన తెలిపి అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. మీజూరు మాధవ్, సుందరం, అశోక్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి వీల్ చైర్ వితరణ



వీల్ చైర్ అందజేస్తున్న నిర్వాహకులు



దివ్యాంగులకు దుస్తులు పంపిణీ చేస్తున్న సంస్థ సభ్యులు, దాతలు

నాయుడుపేట టౌన్ : మండలంలోని పుదూరుకు చెందిన దివ్యాంగురాలు దేవసేనకు గురువారం అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ సభ్యుడు చంద్రశేఖర్ వీల్ చైర్ అందజేశారు. ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ మీజూరు చంద్రకళ మాట్లాడుతూ దివ్యాంగురాలైన అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు కృష్ణవేణి అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తోందని అభినందించారు. రాజశేఖర్, రాంబాబు, వెంకటేశ్వర్లు, ప్రసాద్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు దుస్తుల పంపిణీ

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని వీరభద్ర స్వామి ఆలయ ఆవరణలో గురువారం రెడ్ సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు దుస్తులు పంపిణీ చేశారు. రెడ్ సంస్థ అధ్యక్షుడు జానా సుధీర్ మాట్లాడుతూ పట్టణానికి చెందిన సనిశెట్టి వెంకట శ్రీధర్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు దివ్యాంగులకు దుస్తులు అందించేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. కార్యక్రమంలో సనిశెట్టి వెంకటసుబ్బమ్మ, మలిశెట్టి సాయి, తిరుపతి స్వామి, కోడిపర్తి శ్రీధర్, మెదరు శ్రీనివాసాచారి, పల్లం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన ఆటో డ్రైవర్ మృతి



మృతిచెందిన చంద్రయ్య

నాయుడుపేట టౌన్ : అయ్యప్పరెడ్డిపాళెం జాతీయ రహదారిలో ఆటో బోల్తాపడి గాయపడిన డ్రైవర్ చంద్రయ్య చికిత్స పొందుతూ మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. చిలమాత్తూరుకు చెందిన డ్రైవర్ బట్ట చంద్రయ్య(45) ఈ నెల 17న ఆటోలో కాపులూరు నుంచి నాయుడుపేటకు బయలుదేరాడు. మార్గమధ్యంలో అయ్యప్పరెడ్డిపాళెం జాతీయ రహదారిపై ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. తీవ్రంగా గాయపడిన అతన్ని నాయుడుపేట వైద్యశాలకు, అక్కడి నుంచి నెల్లూరు ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య బట్ట నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారమే లక్ష్యం





సైదాపురం : మాట్లాడుతున్న తహసీల్దార్, పెళ్లకూరు: అర్జీలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

సైదాపురం : రెవెన్యూలో నెలకొన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ రమాదేవి తెలి పారు. మండలంలోని ఊటుకూరులో గురువారం సర్పంచ్ పెంచలయ్య అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు.

ఓజిలిలో..

ఓజిలి: తహసీల్దార్ పద్మావతి సగుటూరులో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 10 వినతులు అందాయన్నారు. ఆర్‌ఐ విజయ్‌కుమార్, సర్వేయర్ లక్ష్మినారాయణ, వీఆర్వో దిలీప్ పాల్గొన్నారు.

దొరవారిసత్రంలో..

దొరవారిసత్రం : మండలంలోని ఆనేగొట్టం, కరటాముడి గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తహసీల్దార్ శైలకుమారి రైతుల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. సర్వేయర్ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రిజర్వాయర్‌గా చెంబేడు చెరువు

పెళ్లకూరు : చెంబేడు చెరువును మినీ రిజర్వాయర్‌గా అభివృద్ధి చేయడానికి చర్యలు చేపడుతున్నట్టు సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తెలిపారు. చెంబేడులో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొన్నారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ దిగువ ప్రాంతాల్లోని 17 గ్రామాల రైతులకు సాగునీరు అందించే చెంబేడు చెరువును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి పాల్గొనకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్డీవో తీరుపై సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేస్తామని వెల్లడించారు. తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి, ఎంపీడీవో ప్రమీలారాణి, ఏవో ప్రవీణ పాల్గొన్నారు.

రాపూరులో..

రాపూరు : రెవెన్యూ సదస్సుల్లో రైతుల సమస్యలను సదస్సుల్లో పరిష్కరించుకోవాలని తహసీల్దార్ లక్ష్మి నారాయణ తెలిపారు. రావిగుటపల్లి, పులిగిలపాడులో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 15 అర్జీలు వచ్చినట్టు తహసీల్దార్ తెలిపారు.

పేదలకు భూములు పంపిణీ చేయాలని వినతి

చిల్లకూరు: మండలంలోని అంకులపాటూరు రెవెన్యూలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని గ్రామస్తులు కోరారు. అంకులపాటూరులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. సాగరమాల రోడ్డుకు తీసుకున్న భూము లకు పరిహారం ఇవ్వలేదని రైతులు వాపోయారు. ఆర్‌ఐ పూర్ణ, సర్వేయర్ మల్లికార్జున్, పాల్గొన్నారు.

నాయుడుపేటలో..

నాయుడుపేట టౌన్ : మండలంలోని చిగురుపాడు, చిగురుపాడు అగ్రహారం గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మూడు అర్జీలు వచ్చినట్టు మండల ప్రత్యేక అధికారి హరోహర, ఆర్‌ఐ సాయితేజ తెలిపారు. సర్పంచ్ ఆనం మస్తానయ్య, వీఆర్వో శ్రీనివాసులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా బెల్టు షాపులు

చిట్టమూరు (చిల్లకూరు) : చిట్టమూరు మండలంలో బెల్టు షాపులను విచ్చలవిడిగా నిర్వహిస్తున్నారు. ఇక్కడ నాలుగు మద్యం దుకాణాలు మంజూరయ్యాయి. వీటిలో విక్రయాలు కొంత తగ్గడంతో దుకాణాల వారు సిండికేట్‌గా మారి బెల్టు షాపుల ఏర్పాటుకు సిద్ధమయ్యారు. గురువారం ఆటోల్లో మద్యం కేసులను పబ్లిక్‌గా సరఫరా చేశారు. దీనిపై ఎక్సైజ్, పోలీసులకు సమాచారం ఇచ్చినా చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీ పెద్దల నుంచి ఆదేశాల మేరకు అధికారులు నడుచుకుంటున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. ఈ క్రమంలో మండలంలో సుమారు 120కి పైగా బెల్టు షాపులు ఏర్పాటైనట్టు సమాచారం. బాటిల్‌పై రూ.30 నుంచి రూ.80 వరకు అదనంగా వసూలు చేస్తున్నట్టు మద్యం ప్రియులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్, పోలీసు అధికారులలు స్పందించి బెల్టు దుకాణాలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై వాకాడు ఎక్సైజ్ సీఐ ప్రసాద్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

రైతులకు అదానీ ఫౌండేషన్ అండ

చిల్లకూరు : తీరప్రాంత గ్రామాల్లోని రైతులకు క్రిష్ణపట్నం పోర్టు అదానీ ఫౌండేషన్ అండగా ఉంటుందని క్రిష్ణపట్నం ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి సీహెచ్ వెంకటేష్ తెలిపారు. మండలంలోని బల్లవోలులో గురువారం రైతులకు టార్పాలిన్ పట్టలు, జిప్సం ఎరువులను ఉచితంగా అందించారు. ఆయన మాట్లాడుతూ రైతులను కేఎఫ్‌పీసీఎల్‌లో సభ్యులుగా చేర్చుకుని అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తున్నట్టు తెలిపారు. ప్రాజెక్టు అన్నపూర్ణ ద్వారా రైతులకు ప్రయోజనం చేకూర్చేలా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామన్నారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి దశరథరెడ్డి మాట్లాడుతూ ఉద్యాన పంటలకు ప్రభుత్వం అందించే రాయితీలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల ఉద్యానశాఖాధికారి కార్తీక్, దువ్వూరు చెంచు కిరణ్‌రెడ్డి, అదానీ ఫౌండేషన్ సీఎస్ఆర్ హెడ్ రాజేష్ రంజన్, డాక్టర్ అనీల్ బాలక్రిష్ణన్, అరుణ్, షేక్ షఫీ తదితరులు పాల్గొన్నారు.



రైతులకు జిప్సం అందజేస్తున్న అదానీ ఫౌండేషన్ ప్రతినిధులు

ఎన్‌సీసీ క్యాడెట్‌కు అభినందన

కోట : విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ ఎన్‌సీసీ ఆర్మీ క్యాడెట్ చంద్రమోహన్ కేరళలోని ఇడుక్కి జిల్లా మరయూర్ అడవుల్లో జరిగే ట్రెక్కింగ్ క్యాంపునకు ఎంపికైనట్టు ఎన్‌సీసీ ఆఫీసర్ మాధవయ్య తెలిపారు. ఈ నెల 21 నుంచి ఎన్‌సీసీ సాహస క్యాంపు ప్రారంభమవుతుందని తెలిపారు. చంద్రమోహన్‌ను గురువారం కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి అభినందించారు.



ఎన్‌సీసీ క్యాడెట్ చంద్రమోహన్‌ను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్